సాక్షి
సిద్దిపేట
సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి, (ఇన్‌సెట్) స్వామివారికి ప్రత్యేక పూజలు

కోరమీసాల మల్లన్నా.. కోటిదండాలు

కొమురవెల్లి మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో ఆదివారం ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే కోనేరులో స్నానాలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశ ఖండన, గంగరేణి చెట్టువద్ద ముడుపులు చెల్లించుకున్నారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. ధర్మదర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది. ఏర్పాట్లను ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

– కొమురవెల్లి (సిద్దిపేట)

న్యూస్‌రీల్

'స్వచ్ఛ బడి' భేష్

కేంద్ర మంత్రిత్వ శాఖ అధికారుల కితాబు



సిద్దిపేటలో కేంద్ర అధికారుల పర్యటన

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీలో అమలవుతున్న స్వచ్ఛ బడి దేశానికి ఆదర్శంగా ఉందని కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ అధికారులు కితాబిచ్చారు. జిల్లాలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా 14 మందితో కూడిన అధికారులు ఆదివారం సిద్దిపేటను సందర్శించారు. స్వచ్ఛ బడి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, డంపింగ్ యార్డ్, కోమటి చెరువు, యూజీడీ వ్యవస్థను పరిశీలించారు. స్టీల్ బ్యాంక్ సేవల గురించి ఆరా తీశారు. పట్టణంలో రుతు ప్రేమ అమలు ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సిద్దిపేట మున్సిపల్ గ్రీనరీ బాగుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ సంపత్ కుమార్, అదనపు కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ దీప్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరుకోలుకు సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజలింగం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల గ్రామానికి చెందిన విద్యావేత్త, ప్రముఖ సంఘ సేవకుడు వరుకోలు రాజలింగం జాతీయ సేవారత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం తిరుపతిలో జరిగిన సమావేశంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డా.సుబ్రహ్మణియన్ ఈ అవార్డును అందజేశారు. రాజలింగం ఎంతో మంది పేదలకు చదువు నేర్పించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. అందుకు గాను ఈ పురస్కారం దక్కింది. ఆయనను గ్రామస్తులు అభినందించారు.

హాస్టల్ వార్డెన్‌ను తొలగించండి

డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు



విద్యార్థులతో మాట్లాడుతున్న వేణు తదితరులు

వర్గల్(గజ్వేల్): నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న వర్గల్ ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన హాస్టల్‌ను సందర్శించి వసతులు, నిర్వహణ తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డెన్ సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని కోరారు.

ఎంపీడీఓల బదిలీలు

సిద్దిపేటరూరల్: లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 18 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఈనెల 12న బదిలీ అవుతున్న ఎంపీడీఓలు రిలీవై 13న జాయినింగ్ రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీచేశారు. బదిలీల్లో భాగంగా మెదక్ జిల్లా నుంచి నలుగురు, వికారాబాద్ జిల్లా నుంచి ముగ్గురు, వనపర్తి నుంచి ఇద్దరు, ఖమ్మం, జగిత్యాల, జనగాం, నాగర్ కర్నూల్, నల్గొండ, నారాయణపేట, జోగుళాంబగద్వాల్, యాదాద్రిభువనగిరి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున జిల్లాకు రానున్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సిద్దిపేటకమాన్: వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని వడ్డెర సంఘం చారిటబుల్ నాయకులు కోరారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలన్నారు. వడ్డెర కార్మికులు వృత్తిలో మరణిస్తే వారి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రీ సర్వే!

ప్రజాపాలన దరఖాస్తులపై ఆరా
- పెద్ద ఎత్తున అసంపూర్తి అప్లికేషన్లు
- జిల్లా వ్యాప్తంగా 97,817 గుర్తింపు
- తిరిగి వెనక్కి పంపిన ప్రభుత్వం
- సమగ్ర వివరాల సేకరణలో యంత్రాంగం



ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ (ఫైల్)

సిద్దిపేటజోన్: ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 97,817 దరఖాస్తులు అసంపూర్తిగా ఉన్నట్లు ప్రభుత్వం తేల్చింది. దీంతో వాటన్నింటినీ తిరిగి వెనక్కి పంపింది. సమగ్ర వివరాల కోసం రీసర్వే చేయాలని ఆదేశాలు అందడంతో జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయి బాటపట్టారు. ఇప్పటికే 46 శాతం మేర దరఖాస్తులను రీ ఎంట్రీ చేసినట్లు సమాచారం.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్ ద్వారా సేకరించిన అధికారులు డేటా ఎంట్రీ అనంతరం నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేశారు. వాటిని పునఃపరిశీలించి అందులో డూప్లికేట్ దరఖాస్తులను తొలగించి వాస్తవ లెక్కలు తేల్చింది. అయినప్పటికీ మహాలక్ష్మి పథకం కింద పెద్ద ఎత్తున అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులను ప్రభుత్వం గుర్తించింది. రేషన్ కార్డులు, గ్యాస్ కనెక్షన్ వివరాలు పొంతన లేనట్టు ప్రభుత్వ పరిశీలనలో తేలింది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 97,817 దరఖాస్తులను గుర్తించారు. ఐదు మున్సిపాలిటీల్లో 16,257 దరఖాస్తులు అసంపూర్తిగా ఉన్నట్లు లెక్కలు తేల్చారు. వాటిని తిరిగి క్షేత్ర స్థాయిలో రీ సర్వే చేయాలని వెనక్కి పంపారు. కొన్ని రోజులుగా సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీల్లో అధికార యంత్రాంగం దరఖాస్తుదారుల సమగ్ర వివరాల కోసం క్షేత్ర స్థాయిలో ఇంటిబాట పట్టింది.

క్షేత్రస్థాయిలో అధికారులు..

మున్సిపాలిటీల్లో కొన్ని రోజులుగా అధికార యంత్రాంగం ప్రజాపాలన దరఖాస్తుల రీ సర్వే పేరిట క్షేత్ర స్థాయిలో బాట పట్టింది. ఆయా మున్సిపాలిటీ కమిషనర్ల నేతృత్వంలో దరఖాస్తుల్లోని ఫోన్ నంబర్ ఆధారంగా అసంపూర్తిగా ఉన్న సమాచారం సరిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. గజ్వేల్ మున్సిపాలిటీలో 3,439 దరఖాస్తులలో 1940, హుస్నాబాద్‌లో 2,307 దరఖాస్తులలో 1257, చేర్యాలలో 1507 దరఖాస్తుల్లో 714, దుబ్బాకలో 1,838 దరఖాస్తులలో 863, సిద్దిపేటలో 7,166 దరఖాస్తులలో 2,049 రీసర్వే చేసి సరైన వివరాలను నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 46శాతం దరఖాస్తులు రీ ఎంట్రీ అయినట్టు సమాచారం.

వేగంగా ప్రక్రియ



ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులలో కొన్ని వివరాలు లేవని ప్రభుత్వం వెనక్కి పంపిన మాట నిజమే. దరఖాస్తుదారులు సరైన గ్యాస్ నంబర్లు, గ్యాస్ కంపెనీ, రేషన్ కార్డ్ నంబర్లు రాయలేకపోవడంతో సమస్య వచ్చింది. వాటిని రీ సర్వే చేసి నమోదు చేస్తున్నాం. ప్రక్రియ వేగవంతంగా చేసి ప్రభుత్వానికి నివేదిక త్వరలోనే అందజేస్తాం.

–సంపత్, మున్సిపల్ కమిషనర్ సిద్దిపేట

పుల్లూరు క్షేత్రం మరింత అభివృద్ధి

- రూ.50లక్షలతో ధర్మశాలల నిర్మాణం
- ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి స్వయంభూ లక్ష్మీనరసింహాస్వామి బండ క్షేత్రాన్ని గొప్పగా అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పుల్లూరులో జరుగుతున్న ఉత్సవాల్లో ఆయన పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని మూడున్నర కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. రూ.35లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, మరో రూ.35లక్షలతో ఆలయ పునరుద్ధరణ, రూ.10లక్షలతో ఆలయం చుట్టూ షెడ్డు, రూ.80లక్షలతో భగీరథ తాగునీటి పథకం, రూ.50లక్షలతో కల్యాణ మండపం, రూ.20లక్షలతో పార్కును అభివృద్ధి చేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో రూ.50లక్షలతో ధర్మశాలలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో చెరువుల్లోకి నీళ్లరానున్నాయన్నారు. జిల్లాలో 459 ఆలయాల్లో పూజారులకు ధూపదీప నైవేద్యం కింద రూ.10వేలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేశ్, అర్చకులు రంగాచార్యులు, రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోండి

జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ మహేశ్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ మహేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, అదేవిధంగా మొబైల్ నంబర్లు తెలపాలన్నారు. ఈ నెల 14లోగా మీ ఇంటి వద్దకు వచ్చే అధికారులకు, అధికారులు రానివేళ దగ్గర్లో ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయంలో జిరాక్స్‌లు అందించాలన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూర్యప్రకాశ్

జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్

దుబ్బాకటౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ అన్నారు. ఆదివారం దుబ్బాకలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మూడో విడత ప్రాక్టికల్ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 వరకు మూడో విడత ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. 16న కొత్తగా ప్రవేశపెట్టిన ఇంగ్లిష్, 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1వరకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష జరుగుతుందన్నారు. గత ఏడాది ప్రథమ సంవత్సరంలో నైతికత–మానవ విలువలు పరీక్ష ఫెయిలైన విద్యార్థులు 17న నిర్వహిస్తున్న పరీక్షను తప్పనిసరిగా రాయాలన్నారు. 19న పర్యావరణం పరీక్ష ఉంటుందన్నారు. ఈ నెల 28 నుంచి ఇంటర్ థియరీ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు మొదటి సంవత్సరంలో 9,831, ద్వితీయ సంవత్సరానికి 11,118 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ పరీక్షలకు గాను జిల్లాలో 44పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశామని చెప్పారు.



దుకాణ సముదాయాల వద్ద భక్తుల సందడి

వైభవంగా లక్ష్మీనర్సింహ స్వామి జాతర

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. ఏటా మూడు నెలల పాటు ప్రతి ఆదివారం జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్ జంట నగరాలు, వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని వంటా వార్పు చేపట్టారు. పవిత్ర కోనేరులో స్నానమాచరించి గుట్టపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని కాలినడకన వెళ్లి దర్శించుకున్నారు. స్వామివారికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది. ఈఓ శశిధర్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి



సూర్య నమస్కారాలు చేస్తున్న అభ్యర్థులు

- పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్
- ముగిసిన రాష్ట్రస్థాయి సూర్యనమస్కార్ పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచిగా మారిందని పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్ అన్నారు. సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి సూర్య నమస్కార్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, ధ్యానం, ప్రాణాయామం తదితర విద్యలు దేశాన్ని సుసంపన్నం చేశాయన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారతీయ సంస్కృతి సమాధానం చెబుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భారత రాజ్య సంఘటన మంత్రి నందనం కృపాకర్, సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు రంగాచారి, సిద్దిపేట స్పోర్ట్స్ అథారిటీ కన్వీనర్ పాల సాయిరాం, సుడా మాజీ డైరెక్టర్ మచ్చ వేణు గోపాల్‌రెడ్డి, జాతీయ యోగా మెడలిస్ట్, శిక్షకుడు తోట సతీశ్, సంధ్య యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ఎమ్మెల్యే అభినందన

సూర్య నమస్కార్ పోటీల్లో విజేతలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. ఆదివారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో విజేతలకు చెక్కులు, మెడల్స్‌ను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయిలో అద్భుతంగా రాణించాలని కోరారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి(అందోల్): విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆదివారం మండలంలోని మునిపల్లి, బుదేరా, కంకోల్, పెద్దచల్మెడ, తాటిపల్లి, చీలపల్లిలో సుమారు రూ.1415.50 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అంతకుముందు మునిపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. మోడల్ స్కూల్, బాలికల హాస్టల్‌ను మరింత అభివృద్ధి చేయడానికి రూ.80లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తాను గతంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. బుదేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. అనంతరం రెసిడెన్షియల్ హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. హాస్టల్, కళాశాల, ఇంటర్మీడియెట్ కళాశాల చుట్టూ ఉన్న సుమారు 20 ఎకరాలను సర్వే చేయించి ప్రహరీ, గేట్, అదనపు తరగతి గదుల నిర్మాణం, క్రీడా సదుపాయాల కల్పనకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు పంపించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కంకోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు దసరాలోపు పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామన్నారు. పెద్దచల్మెడ పాఠశాల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షి, మాజీ ఎంపీపీలు తాటిపల్లి రాంరెడ్డి, బుదేరా రాజేశ్వర్‌రావు, మనోహర్, పాండు, సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ గాయత్రి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఈఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ తెన్‌మొళి, ఎంపీడీఓ హరినందన్ రావు, భాస్కర్‌రెడ్డి, సతీశ్ కుమార్, రసూల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లి మోడల్ స్కూల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర

ఇసుకాసురులు..!

యథేచ్ఛగా అక్రమ రవాణా
- కరీంనగర్, సిద్దిపేట జిల్లాల మీదుగా..
- వే బిల్లులు లేకున్నా అడిగేవారు కరువు
- రహదారి పక్కనే డంపులు



టాస్క్‌ఫోర్స్ స్వాధీనం చేసుకొన్న ఇసుక డంపులు ఇవే

గజ్వేల్: అక్రమ ఇసుక రవాణాకు రాజీవ్ రహదారి అడ్డాగా మారింది. ఈ రహదారిపై కరీంనగర్, సిద్దిపేట జిల్లాల మీదుగా నిత్యం వందల లారీల్లో ఇసుక తరలివెళుతోంది. ఓవర్‌లోడింగ్, వేబిల్లులతో ప్రమేయం లేకుండా ఈ 'దందా' సాగుతోంది. అక్రమార్కులు అధికారులను మామూళ్ల మత్తులో ముంచుతూ.. ఇసుకను రాజీవ్‌రహదారిపై చెక్‌పోస్టులను దాటిస్తున్నారనే విమర్శలున్నాయి. అలాగే రహదారి పక్కనే ఇష్టానుసారంగా ఇసుకను డంపు చేస్తున్నారు.

ఓవర్ లోడింగ్..

కొందరు ఇసుకను అక్రమంగా జిల్లాలు దాటిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని మోయతుమ్మెద వాగు, కరీంనగర్ మండలం ఆరెపల్లిలోని మానేరువాగు, ఇదే జిల్లాలోని ఆరెపల్లిలో గల క్వారీల నుంచి ఇసుక అక్రమంగా తరలివెళుతోంది. నిజానికి 10 టైర్ల లారీలో 17టన్నులు, 12టైర్ల లారీలో 21టన్నుల ఇసుకను నింపాల్సి ఉంటుంది. కానీ లారీల యజమానులు దీనికి 10 నుంచి 20టన్నుల వరకు అదనంగా ఇసుకను నింపి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. క్వారీల్లో ఒక్కో టన్నుకు రూ.1000లోపు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అయిదు రెట్లకు పైగా ధర పెంచి సొమ్ము చేసుకుంటున్నారు.

తూతూ మంత్రంగా తనిఖీలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి హైదరాబాద్ వరకు సుమారు 170 కిలోమీటర్ల పొడవునా పదికి పైగా చెక్‌పోస్టులు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఇసుకను నింపి వే బిల్లు తీసుకుని తరలించాల్సి ఉంటుంది. అవేమీ పాటించకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

రహదారి పక్కనే డంపులు

రాజీవ్ రహదారి పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా తమ ఇష్టానుసారంగా ఇసుకను డంపు చేస్తున్నారు. డంపుల్లో ఉన్న ఇసుక దొడ్డు రకానికి టన్నుకు రూ.2000, సన్న రకానికి రూ.3000కుపైగా విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తూతూ మంత్రంగా దాడులుచేసి వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 8, 9 తేదీల్లో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ బృందం భారీగా ఇసుక డంపులను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసింది. ఈ రహదారిపై శనిగరం, సిద్దిపేట, పొన్నాల, దుద్దెడ, లకుడారం, కుకునూర్ పల్లి, గౌరారం, వంటిమామిడి తదితర ప్రదేశాలు ఇసుక డంపులకు స్థావరాలుగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కౌన్సిలర్‌కు జాతీయ అవార్డు ప్రధానం



జాతీయ అవార్డు అందుకుంటున్న పద్మ

హుస్నాబాద్: ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలు, రాజకీయాల్లో ప్రజలతో మంచి గుర్తింపు పొందినందుకు హుస్నాబాద్ పట్టణంలోని 7వ వార్డు కౌన్సిలర్ చిత్తారి పద్మకు బహుజన సాహిత్య అకాడమీ ప్రధానం చేసే సేవా రత్న జాతీయ అవార్డు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ 7వ జాతీయ సౌత్ ఇండియా తిరుపతిలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో చిత్తారి పద్మను జాతీయ అవార్డుతో సత్కరించారు. అవార్డును ప్రముఖ సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, వివిధ రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు.

పెండింగ్ పింఛన్లు ఇవ్వాలి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు సాజీద్



మాట్లాడుతున్న సాజీద్

దుబ్బాకటౌన్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులు కేటాయించకపోవడం అన్యాయమని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు సాజీద్ అన్నారు. ఆదివారం దుబ్బాకలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 40 లక్షల మంది దివ్యాంగులు ఉంటే ఇందులో కొంత మందికే ఆసరా పింఛన్లు అందుతున్నాయన్నారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో 4 శాతం దివ్యాంగులకు కేటాయించాలన్నారు. సమావేశంలో దివ్యాంగులు లక్ష్మీనర్సయ్య, యాదగిరి, ప్రభాకర్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌కు పాపన్నపేట వాసి



మెడల్‌తో ప్రభాకర్ గౌడ్

పాపన్నపేట(మెదక్): అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు పాపన్నపేట ఎల్లాపూర్ వాసి కానిస్టేబుల్ ప్రభాకర్‌గౌడ్ ఎంపికయ్యారు. గచ్చిబౌలిలో ఆదివారం జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న ప్రభాకర్ కాంస్య పతకం సాధించాడు. త్వరలోనే శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ ఎంపికపై గ్రామ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి క్రీడాభిమానులు యువకులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తి అదృశ్యం

చేగుంట(తూప్రాన్): వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి దీపక్ (23) ఈనెల 7న అయోధ్యకు వెళ్తున్నా అని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీపక్ తాత బాల్‌నర్సయ్య ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ దూరం.. ఎన్నాళ్లీ భారం

రేషన్ బియ్యం తీసుకురావాలంటే లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. కడుపు నిండాలంటే కాలినడకన వెళ్లాల్సిందే. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి దుస్థితి నెలకొంది. రేషన్ సౌలభ్యం కోసం కొత్త పద్ధతులు తీసుకొచ్చినా దుకాణాలను మాత్రం పెంచలేదు. మర్కూక్, వర్గల్, ములుగు మండలాల్లో నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటై ఐదేళ్లు గడిచినా రేషన్ దుకాణాలను మాత్రం వేరు చేయలేదు. దీంతో సరుకుల కోసం లబ్ధిదారులు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

\- మర్కూక్(గజ్వేల్)

- లబ్ధిదారులకు తప్పనితిప్పలు
- సరుకుల కోసం మూడు కిలోమీటర్లు నడకయాతన
- పొరుగు గ్రామాల్లో దుకాణాలు
- కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటై ఐదేళ్లు
- 14 గ్రామాల్లో షాపులు లేని వైనం



రేషన్ సరుకులు తీసుకుంటున్న ప్రజలు

మర్కూక్ మండలంలోని గంగాపూర్- యూసుఫఖాన్‌పల్లి, గణేశ్‌పల్లి గ్రామాలు 5 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ములుగు మండలంలో ఆరు నూతన గ్రామ పంచాయతీలు వాగునూతి, చిన్న తిమ్మాపూర్, దాసర్లపల్లి, గంగధార్‌పల్లి, బండ తిమ్మాపూర్, అలీనగర్ కొత్త ఏర్పడ్డాయి. అలాగే వర్గల్ మండలంలో సీతారాంపల్లి, దండుపల్లి(గౌరగూడెం), గోవిందాపూర్, శాకారం, మల్లారెడ్డిపల్లి, నగర్‌తండా గ్రామాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతీ గ్రామంలో 150 పై చిలుకు రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం మూడు మండలాల్లో 14 గ్రామ పంచాయతీలకు రేషన్ షాపులు లేకపోవడం గమనార్హం.

మూడు కిలోమీటర్లు..

మర్కూక్ మండలంలోని గంగాపూర్-యూసుఫ్‌ఖాన్‌పల్లి గ్రామంలో 900 వందల మంది జనాభా ఉండగా 183 రేషన్ కార్డులు ఉన్నాయి. అలాగే గణేశ్ పల్లి గ్రామంలో 140 రేషన్ కార్డులు, 650 మంది జనాభా ఉన్నారు. అయితే ఈ గ్రామాలకు రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో పక్క గ్రామాలైన మర్కూక్, చేబర్తి గ్రామాలకు 3 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునేవారు. వీరి ఇబ్బందులు చూడలేక మాజీ సర్పంచ్ మంజుల శ్రీరాములు సొంత ఖర్చులతో చేబర్తి, అంగడి కిష్టాపూర్ గ్రామాల నుంచి గణేశ్‌పల్లి గ్రామంలో కావాల్సిన రేషన్ సరుకులను వాహనాలలో తెప్పించి పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన రావడంతో తాము మళ్లీ కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు.

బయోమెట్రిక్ విధానంతో..

ఇంతకు ముందు నడవలేని వృద్ధులు, ఒంటరి మహిళల కార్డులను ఇతరులకు ఇస్తే సరుకులు తీసుకునే అవకాశం ఉండేది. కానీ బయోమెట్రిక్ విధానం తీసుకురావడంతో రేషన్ పక్కదారి పట్టకుండా కార్డు దారులే సరుకుల కోసం వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు 3 కిలోమీటర్ల మేర నడిచి వెళ్లడం పెద్ద సమస్యగా మారింది. ఇప్పుడు ఈకేవైసీ పూర్తి చేస్తేనే రేషన్ బియ్యం ఇస్తున్నారు. లబ్ధిదారులు తప్పనిసరిగా రేషన్ షాపునకు వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ షాపులు లేని గ్రామాలు చాలానే ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నడవలేకపోతున్నాం



రేషన్ బియ్యం తెచ్చుకోవడం కోసం నానా తిప్పలు పడుతున్నాం. అంత దూరం మా గ్రామం నుంచి ఆటోలు పోవు.. నడుచుకుంటూనే పోతున్నాం.. బియ్యం తీసుకున్నాక మోసుకొని రావాలంటే దేవుడు యాదికొస్తుండు. ఇప్పుడున్న సర్కారు ఆలోచన చేసి మా ఊర్లనే రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలే. మా తిప్పలు తీర్చాలే.

\- చిలుక మల్లవ్వ (గంగాపూర్)

షాపు ఏర్పాటు చేయాలి



ప్రతి నెలా నడుచుకుంటూ వెళ్లి బియ్యం తెచ్చుకునేవాళ్లం. మూడు కిలో మీటర్లు నడవలేక పోతున్నాం. మా సర్పంచ్ మంజుల శ్రీరాములు మా ఊర్ల రేషన్ షాపు లేకున్నా సరుకులు తెప్పించేవాడు. కానీ ఇప్పుడు మళ్లీ నడుచుకుంటూ పోయి సరుకులు తెచ్చుకోవాలంటే భయమేస్తోంది. మా గ్రామంలో రేషన్ దుకాణం పెట్టాలి.

\-లక్ష్మమ్మ (గణేశ్‌పల్లి)

ప్రతిపాదనలు రాగానే..

గంగాపూర్- యూసుఫ్‌ఖాన్‌పల్లి, గణేశ్‌పల్లి గ్రామాలకు రేషన్ దుకాణాలకు సంబంధించి ప్రతిపాదనను జిల్లా పౌర సరఫరాల శాఖకు అందించడం జరిగింది. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు, వృద్ధులు మూడు కిలో మీటర్లు వెళ్లి తెచ్చుకోవడం వాస్తవమే. గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. ఈ ప్రభుత్వంలో ప్రతిపాదనలు వస్తే కొత్తగా రేషన్ షాపులు ఏర్పాటు చేస్తాం.

\- చంద్రశేఖర్‌రావు (తహసీల్దార్)

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు
- సిద్దిపేట జిల్లా విస్తృతస్థాయి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న సింహాచలం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): న్యాయపరమైన చిక్కులను తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా విస్తృత కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం సిద్దిపేట జిల్లా విస్తృ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహమ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సింహాచలం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కోర్టు ఆటంకాలను తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ఈనెల 13కు వాయిదా వేశారన్నారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం ఈ బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు స్వల్పంగా పెంచడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్)రద్దు చేస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభావతి, జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి, జిల్లా కోశాధికారి కృష్ణ, జిల్లా కార్యదర్శులు వెంకట కిరణ్, కనకరాజు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శివలింగం, సోషల్ మీడియా కన్వీనర్ ప్రవీణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గల్లంతై.. రెండు రోజులకు శవమై..

చెక్ డ్యాంలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): జాతరలో దైవ దర్శనానికి వెళ్లి వాగులో గల్లంతైన వ్యక్తి నీటిలో శవమై తేలాడు. మిరుదొడ్డి పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుమల్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన మద్దెల స్వామి(41) కుటుంబ సభ్యులతో కలిసి 9వ తేదీన మిరుదొడ్డి, అల్వాల శివారులోని కోదండరాముడి జాతర వచ్చాడు. కూడవెల్లి వాగుపై నిర్మించిన చెక్ డ్యాం ఉధృతంగా ప్రవహిస్తోంది. అల్వాల ఆవలి గట్టుపై ఉన్న ఆలయాన్ని చేరుకోవడానికి భక్తులకు దారి లేదు. కానీ స్వామి కొబ్బరి కాయను తీసుకొని వాగును ఈదుకుంటూ వెళ్లి దైవ దర్శనం చేసుకోవాలని ప్రయత్నించాడు. ఈ క్రమంలో స్వామి నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. శుక్ర, శనివారం ఎంత గాలించినా ఫలితం దక్కలేదు. అయితే, అల్వాల చెక్ డ్యామ్‌కు సమీపంలో ఆదివారం ఉదయం స్వామి శవం నీటిలో తేలుతూ కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మూడు రోజులుగా ఎదురుచూస్తున్న భార్యాపిల్లలు, కుటుంబ సభ్యు లు, బంధుమిత్రులు స్వామి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిరుదొడ్డి పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుమల్ బాబు తెలిపారు.

దారి దోపిడీ గ్యాంగ్ అరెస్టు

ఆటో డ్రైవర్‌గా నటించి వృద్ధురాలి మెడలో గుండ్లు చోరీ



వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: దారి దోపిడీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి క్రైమ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన కంది మండలానికి చెందిన వడ్ల మణెమ్మ(60) పాశమైలారం వెళ్లేందుకు పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో నిల్చుంది. ఆదే సమయంలో ఆటోలో ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ ప్యాసింజర్లుగా వచ్చి పాశమైలారం వెళ్తున్నామని ఆటోలో మణెమ్మను ఎక్కించుకున్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు బ్రిడ్జి పైకి తీసుకెళ్లి వృద్ధురాలి మెడలోంచి గుండ్లను తెంపుకొని ఆటోలో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం పటాన్‌చెరు పాత టోల్‌గేట్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు, మహిళ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారు. దొంగతనానికి పాల్పడిన వారు చందానగర్ శాంతి నగర్ కు చెందిన జెర్పాటి యాదయ్య, బీరంగూడ పరిధిలోని లింగమయ్య కాలనీకి చెందిన భార్యాభర్తలు బొంత కృష్ణ, బొంత రేణుకగా తెలిపారు.వీరి నుంచి బంగారు గుండ్లు, ఆటోను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి సెల్ టవర్ కంపెనీకి..

రూ.30 లక్షల విలువ

హుస్నాబాద్‌రూరల్: రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా హుస్నాబాద్ మండలం గాంధీనగర్ పంచాయతీ అధికారులు ప్రైవేట్ సెల్ కంపెనీకి 15 ఏళ్లు లీజుకు ఇవ్వడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో సెల్ టవర్ ఏర్పాటు కోసం కంపెనీల ఉద్యోగులు పంచాయతీ అధికారుల నుంచి తీర్మాణాలు చేసుకొని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పనులు చేస్తున్నారు. ప్రధాన రహదారికి పక్కనే భూములు కావడంతో వాటి విలువ రూ.30 లక్షలు పలుకుతుంది. పంచాయతీ అధికారులు తీర్మాణం ఇచ్చారని దర్జాగా కంపెనీ ఉద్యోగులు బండను బ్లాస్టింగ్ చేసి పర్యావరణం దెబ్బ తీస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ భూమి ఎవరికీ ఇవ్వలేదు

మా దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం. గాంధీనగర్‌లో సెల్ టవర్ నిర్మాణం విషయం నా దృష్టికి రావడంతో పనులు నిలిపివేయించాం. విచారణ జరిపి ప్రభుత్వ భూమి కాపాడి గ్రామస్తులకు ఉపయోగపడేందుకు కేటాయిస్తాం.

\- రవీందర్‌రెడ్డి, తహసీల్దార్



ప్రభుత్వ భూమిలో చేస్తున్న పనులు

వరించిన బాల సాహిత్య పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న అర్పిత



అవార్డు అందుకుంటున్న ఐశ్వర్య

హవేళీఘణాపూర్(మెదక్): హవేళీఘణాపూర్ జెడ్పీ హైస్కూల్ ఏడవ తరగతి విద్యార్థిని అర్పితకు బాల సాహిత్య పురస్కారం వరించింది. మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో బడి పిల్లల కథల పోటీలు 2023లో భాగంగా ఆదివారం రవీంద్ర భారతిలో పురస్కారం అందజేత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అర్పిత ప్రముఖ బాలసాహిత్య రచయితలు చొక్కాపు వెంకటరమణ, వీఆర్ శర్మ, మాచిరాజు కామేశ్వరరావు, దాసరి వెంకటరమణ చేతుల మీదుగా బాలసాహిత్య పురస్కారం అందుకున్నారు. ఆమె రాసిన మనసుంటే మార్గం కథకు ఈ పురస్కారం లభించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ మాట్లాడుతూ.. అర్పిత రాష్ట్రస్థాయిలో బాలసాహిత్య పురస్కారం అందుకోవడం గొప్ప విషయమని సంతోషం వ్యక్తం చేస్తూ, ఆమెతోపాటు తెలుగు ఉపాధ్యాయులు అశోక్, శశికుమార్, ఉండ్రాళ్ల రాజేశంలకు అభినందనలు తెలిపారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని సిర్సనగండ్ల గ్రామ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని పుల్ల ఐశ్వర్య ఆదివారం బాల సాహిత్య పురస్కారం అవార్డు అందుకున్నారు. ఆమె రాసిన తేనెటీగ సాయం కథనానికి ఈ పురస్కారం లభించింది. అవార్డుతో పాటు జ్ఞాపికను నిర్వాహకులు మాచిరాజు కామేశ్వర్‌రావు అందజేశారు. అవార్డు అందుకోవడానికి ఉపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విఠల్ మాట్లాడుతూ.. పాఠశాల పేరు ప్రఖ్యాతలు రవీంద్రభారతిలో వినిపించేలా చేయడం గొప్ప విషయమన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ కనకసూరిలతోపాటు ఉపాధ్యాయులు ఐశ్వర్యను అభినందిస్తూ మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ కలప సీజ్

సిద్దిపేటరూరల్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న కలపను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్న ఘటన మండల పరిధిలోని బండచెర్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నమ్మదగిన సమాచారం మేరకు అక్రమంగా డీసీఎంలలో కలపను తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు మండల పరిధిలోని బండచెర్లపల్లి గ్రామం వద్ద అక్రమ కలపను పట్టుకొని రూరల్ పోలీస్ స్టేషన్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ.. ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, పేకాట, జూదం గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడుతున్న వారి వివరాలను 100 నంబర్‌కు గాని, టాస్క్‌ఫోర్స్ అధికారుల నంబర్లు 87126 67447, 87126 67446 కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ One Sitting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760 [H-601585]

SERVICES

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపార రుణం,తక్కువవడ్డీ రేటు,సిబిల్‌అవసరంలేదు, NPAకూడా దరఖాస్తు చేసుకోవచ్చు.ఏజెంట్స్ కావలెను. అర్బన్ ఫైనాన్స్, పార్థిబా, 7627832084. [T-229]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233785]

■ Sales & Service Engineers, Qly: Dip. Electronics & B.Sc Electronics/ Any Degree. Divis Medical Systems, Vja, Hyd ✆ 9885327399/ 8498968592 [B-1264551]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిమ్మ.. లాభాల కొమ్మ



- మార్కెట్‌లో మంచి డిమాండ్
- వేసవిలో విరివిగా విక్రయాలు
- చీడ పీడల నివారణతో అధిక దిగుబడులు
- సస్య రక్షణ చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయ అధికారులు



అనిల్ కుమార్, వ్యవసాయ అధికారి

మిరుదొడ్డి(దుబ్బాక): పండ్ల తోటలో నిమ్మ సాగు ప్రధానంగా నిలుస్తోంది. ఈ సాగులో డ్రిప్పును వినియోగిస్తే నీటిని సైతం పొదుపుగా వాడుకోవచ్చు. దీర్ఘకాలికంగా సాగు చేయడం వల్ల మంచి ఆర్థికాదాయం కూడా లభిస్తుంది. నిమ్మలో సిట్రస్, భాస్వరం వంటి ఉత్పత్తులతో పాటు వేసవిలో షర్బత్ వంటి చల్లని పానీయాలు, పచ్చళ్లు, ఆకుల నుంచి సుగంధ ద్రవ్యాలు తయారవుతుండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతోంది. కానీ నిమ్మ తోట సాగు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి. లేకపోతే చీడపీడలు ఆశించి నష్టాలను కలిగిస్తాయి. ప్రాథమిక స్థాయిలో నిమ్మను ఆశించే పురుగులను గుర్తించి సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని హార్టీ కల్చర్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. నిమ్మలో సస్య రక్షణ చర్యలపై రైతులకు సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

సస్య రక్షణ చర్యలు

ప్రధానంగా ఆకు ముడత, గొంగళి పురుగులు, తెల్ల పొలుసు పురుగులు, నల్లి పురుగులు, తెల్ల దోమ, పేనుబంక, ఎగిరే పేను, రసాన్ని పీల్చే రెక్కల పురుగులు, పిండి పురుగులు, చెదలు, నులి వంటి పురుగులు ఆశించి నిమ్మ తోటలకు నష్టాన్ని కలిగిస్తాయి.

ఆకు ముడత..



- శీతాకాలంతోపాటు వర్షాకాలంలో అధికంగా కనిపిస్తాయి.
- నర్సరీ దశ నుంచి పెద్దగా ఎదిగిన చెట్లను ఆశిస్తాయి.
- ఆకులపై తెల్లటి చారలతో వంకర టింకరగా కనిపిస్తాయి. ఆకులు ముడతలు పడి గజ్జి తెగులు సోకడంతో ఆకులు రాలిపోతాయి.
- వీటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి. లీ. లీటర్ నీటిని కలిపి లేత చిగుళ్ల దశలో 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

నారింజ పురుగులు



- గుడ్ల నుంచి వెలువడిన నారింజ పురుగులు, పచ్చ గొంగళి పురుగులు లేత ఆకులను తినడం వల్ల నిమ్మకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి.
- ఈ పురుగుల ఉధృతి ఫిబ్రవరి నెలలో అధికంగా కనిపిస్తుంది.
- వీటి నివారణకు మోనోక్రోటోపాస్1.6 మి. లీటర్లు లేదా డైక్లోర్‌వార్ 1 మి. లీ. లేదా మిథైల్ పెరాథియాన్ 2 మి. లీ. లీటర్ నీటికి కలిపి పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడే పిచికారీ చేయాలి.

తెల్ల పురుగులు

- కాండంలపై అధిక సంఖ్యలో ఆశించడం వల్ల సున్నం పూసిన మాదిరిగా కనిపిస్తాయి.
- రసాన్ని పీల్చడం వల్ల కొమ్మలు వాడిపోయి చెట్లు ఎండిపోతాయి.
- వీటి నివారణకు కాండాన్ని గోనె సంచులతో రుద్దాలి. మిథైల్ డెమటాన్/డైమిథోయేట్ 2 మి. లీ. లీటర్ నీటికి కలిపి కాండం, కొమ్మలపై పిచికారీ చేయాలి.

నల్లి పురుగులు

- ఇందులో ఆకుపచ్చ నల్లి, మంగు నల్లి పురుగులు ముఖ్యమైనవి.
- ఆకుపచ్చ నల్లి ఆకులపై, కాయలపై రసాన్ని పీల్చడం వల్ల తెల్లని మచ్చలు ఏర్పడతాయి.
- మంగునల్లి కాయల రసాన్ని పీల్చడం వల్ల గోధుమ, లేదా ఊదా రంగు మచ్చలు ఏర్పడి కాయల్లో మంగు ఏర్పడుతుంది. దీంతో కాయలు చిన్నవిగా ఉండి గట్టిగా పెలుసుబారిపోయి నాణ్యత తగ్గిపోతుంది.
- వీటి నివారణకు నీటిలో కరిగే లీటర్ నీటికి 3 గ్రాములు గంధకం లేదా 3.0 మి. లీ. డైకోఫాల్‌ను పిచికారీ చేయాలి.

నల్లదోమ

- నలుపు రంగులో ఉన్న పురుగులు రసాన్ని పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోతాయి.
- నల్ల దోమల విసర్జన నుంచి వెలువడే పదార్థంతో ఆకులపై శిలీంద్రాలు పెరిగి బూజు ఏర్పడుతుంది.
- వీటి నివారణకు నీడలో ఉన్న కొమ్మలను కత్తిరించి 0.5 మి. లీ. ఇమిడాక్లోప్రిడ్ లీటర్ నీటికి కలిపి చెట్టు లోపలి భాగం తడిచేటట్టు పిచికారీ చేయాలి.

పేనుబంక, ఎగిరే పేను

- లేత ఆకులతోపాటు పూతను ఆశించి రసాన్ని పీలుస్తాయి.
- పేనుబంక వెర్రి తెగులును, ఎగిరే పేను, శంకు తెగులును వ్యాప్తి చేస్తుంది.
- వీటి నివారణకు డైమిథోయేట్ 2 మి. లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రెక్కల పురుగులు

- పండ్లకు రంధ్రాన్ని చేసి రసాన్ని పిలుస్తాయి.
- రంధ్రాల్లో శిలీంద్రాలు, బ్యాక్టీరియా చేరి పండ్లు కుళ్లి రాలిపోతాయి.
- వీటి నివారణకు కుళ్లి రాలిపోయిన పండ్లను ఏరి వేసి నాశనం చేయాలి.
- తోట చుట్టూ ఉన్న పొదులను, తిప్ప తీగలను తొలగించడం ద్వారా పురుగుల బెడదను తగ్గించవచ్చు.

పిండి పురుగు

- లేత కొమ్మలు, కాయలు, తొడిమెల రసాన్ని పీలుస్తాయి.
- వీటి నివారణకు మలాథియాన్ 2 మి. లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.